

బయోమెట్రిక్ ప'రేషన్'




రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు

బయోమెట్రిక్ వేస్తున్న లబ్ధిదారులు

- వినియోగదారుల నుంచి పలుమార్లు వేలిముద్రలు
- గంటల తరబడి రేషన్ దుకాణాల వద్దే లబ్ధిదారులు
- సర్వర్ బిజీతో ఇబ్బందులు
- మూడు నెలల బియ్యం పంపిణీ షురూ
- జిల్లాలో రేషన్ లబ్ధిదారులు 5.35 లక్షల మంది

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పేద ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులకు గురికాకుండా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 3 నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం సరఫరా మొదలైంది. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి ఒకే సారి లబ్ధిదారులకు రేషన్ బియ్యాన్ని అందిస్తున్నారు. ఇతర రాష్ట్రాల కంటే భిన్నమైన పరిస్థితి తెలంగాణలో ఉంది. దొడ్డురకం బియ్యం బదులు సన్నరకం బియ్యం పంపిణీ కొనసాగుతోంది. బియ్యం సరఫరాకు రేషన్ డీలర్లు అనేక ఇబ్బందుల మధ్య సరఫరాకు పూనుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రేషన్ సరఫరాలో బయోమెట్రిక్ సమస్య ఇబ్బందికి గురిచేస్తోంది. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇవ్వడంతో లబ్ధిదారులు అనేకమార్లు వేలిముద్రలు వేయాల్సి వస్తోంది. జిల్లాలో 345 రేషన్ దుకాణాలు ఉండగా, 1,77,851 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో అంత్యోదయ కార్డులు 13,748, ఆహార భద్రత కార్డులు 1,63,900, అంత్యోదయ అన్నయోజన కార్డులు 203 ఉన్నాయి. వీటి పరిధిలో లబ్ధిదారులు 5,35,920మంది ఉన్నారు. ఇందులో అంత్యోదయ లబ్ధిదారులు 37,389 మంది, ఆహార భద్రత లబ్ధిదారులు 4,98,324 మంది, అంత్యోదయ అన్నయోజన లబ్ధిదారులు 207మంది ఉన్నారు. వీరికి మూడు నెలల కోటా 98.59 లక్షల కిలోల బియ్యం పంపిణీ మొదలైంది. ఈనెల 1వ తేది నుంచి బియ్యం పంపిణీ చేస్తున్నప్పటికీ బయో మెట్రిక్ సంబంధించి కేంద్రప్రభుత్వం నుంచి వచ్చే 5కిలోలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిలో బియ్యంకు సంబంధించి పలుమార్లు వేలిముద్రలు వేయాల్సి వస్తోంది. మూడు నెలలకు సంబంధించి మూడు సార్లు కొన్ని సందర్భాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి కూడా వేలిముద్రలు ఆరు సార్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక్కో వినియోగదారుడు 20నిముషాల వరకు బయో మెట్రిక్‌తోనే గడపాల్సి వస్తోంది. అంతేకాకుండా పది కిలోలు, 20 కిలోలు, 30 కిలోల బియ్యం పంపి జీకి వేలిముద్రలు తీసుకోవడం వల్ల ఆలస్యంతో పాటు సర్వర్ బిజీతో మరింత ఇబ్బంది అవుతోంది. ఒక్కొక్కరికి 6కిలోల చొప్పున ఇద్దరు లబ్ధిదారులు ఉంటే 12 కిలోలు ఇవ్వాల్సి ఉంటుంది. అందుకు 10 కిలోలకు ఒకసారి, 2కిలోలకు ఒకసారి వేలి ముద్రలు వేయాల్సి వస్తోందని రేషన్ డీలర్లు చెబుతున్నారు. మరో వైపు నెలకు సంబంధించిన రేషన్ సమాచారం ఉండగా, మూడు నెలలకు .. మిగతా 8లో

మూడు నెలల రేషన్ కోటా పంపిణీ ఇలా..

మండలం	లబ్ధిదారులు	బియ్యం (కిలోల్లో)
బోయినపల్లి	35,224	6,35,698
చందుర్తి	32,671	5,75,444
గంభీరావుపేట	44,049	7,96,665
ఇల్లంతకుంట	45,684	8,10,801
కోనరావుపేట	43,077	7,61,987
ముస్తాబాద్	45,382	8,21,029
రుద్రంగి	16,155	2,89,183
సిరిసిల్ల	85,726	17,60,795
తంగళ్లపల్లి	42,401	8,11,116
వీర్నపల్లి	14,055	2,55,335
వేములవాడ	60,249	10,64,136
వేములవాడ రూరల్	22,483	3,97,365
ఎల్లారెడ్డిపేట	48,764	8,80,232
మొత్తం	5,35,920	98,59,786

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక..

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

8



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ



రైతులకు విత్తనాలను అందిస్తున్న వ్యవసాయాధికారులు

నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దు..

- జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం

8

భూసమస్యల పరిష్కారమే 'భూభారతి' చట్టం లక్ష్యం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

ఇల్లంతకుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకవచ్చిందని కలెక్టర్ సందీప్‌కుమాఱ ఝా పేర్కొన్నారు. మండలంలోని ముస్కానిపేట గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజల వద్దకు వెళ్లి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించాలనే లక్ష్యంతో ఈనెల 20వరకు గ్రామాలలో రెవన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. ప్రతి మనిషికి ఆధార్‌కార్డు ఉన్నట్లే భూమికి భూధార్‌కార్డు అందించడం జరుగుతుందన్నారు. ఇకమీదట భూముల క్రయవిక్రయాలకు తప్పనిసరిగా మ్యాప్ జతచేయాలన్నారు. సాదాబైనామా దరఖాస్తులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రస్తుతం భూమి ఎవరి కబ్జాలో ఉందో తెలుసుకోవడానికి పంచనామా నిర్వహించి పట్టాలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. భూముల మ్యుటేషన్ సమయంలో కుటుంబ సభ్యులందరికి తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంటేశ్వర్లు, తహసీల్దార్ ఫారూఖ్‌లతో పాటు రెవన్యూ అధికారులు పాల్గొన్నారు.

మహిళల రక్షణే లక్ష్యంగా ముందడుగు : ఎస్పీ

సిరిసిల్ల క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నామని ఎస్పీ మహేశ్ బి.గీతే అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో షీటీం బృందాలు విస్తృతంగా నిఘా వేశాయన్నారు. జిల్లాలో మహిళల రక్షణకు ప్రథమ బాధ్యతగా తీసుకుంటూ మహిళల రక్షణే ధ్యేయంగా వినూత్న కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని అన్ని కళాశాలలు, పాఠశాలల్లో సందర్శిస్తూ విద్యార్థులకు పోక్సో యాక్ట్, సెక్సువల్ హరాస్‌మెంట్, ఈవ్ టీజింగ్, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, మహిళల చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటుగా విద్యార్థులకు సమస్యలు ఎదురైనపుడు వారు సంప్రదించే విధంగా షీ టీం పని చేస్తుందన్నారు. డయల్ 100, షీటీం నంబర్లు ఆయా కళాశాలలు, పాఠశాలల్లో ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా వేదికగా విద్యార్థినులపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే నిర్భయంగా జిల్లా షీటీం నంబర్ 8712656425కు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఆకతాయిల ఆటకట్టిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్న జిల్లా షీ టీం పని చేస్తోంద పేర్కొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన షీటీం విద్యార్థులు, మహిళల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ ఆకతాయిల ఆట కట్టించామన్నారు. మే నెలలో మహిళలను, విద్యార్థులను వేధిస్తున్న వారిపై 6 ఇ-పెట్టి కేసులు, 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని పేర్కొన్నారు.

యోగా 2కే రన్..



2కే రన్‌లో పాల్గొన్న వైద్య సిబ్బంది

సిరిసిల్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సిరిసిల్లలో యోగా అభిమానులు యోగా 2 కే రన్ నిర్వహించారు. సిరిసిల్ల అయుష్మాన్ ఆరోగ్య మందిర్, అయుష్ విభాగం ఆధ్వర్యంలో సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా నుంచి మానేరు బతుకమ్మ ఘాట్ వరకు 2కే రన్ నిర్వహించి యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల యునాని డిస్పెన్సరీ శిక్షకులు బొల్లాజి శ్రీనివాస్, తిప్పరవేణి స్వప్న, డీపీఎం తిరుపతి, సోల్జర్, స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు అశోక్, రాజేందర్, మధు, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణ మహోత్సవం



రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

గంభీరావుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం కోళ్లమద్ది గ్రామంలో స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గత నెల 31 నుంచి ప్రారంభమాయ్యాయి. ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా పోచమ్మ బోనాలు, ఎల్లమ్మ బోనాలు, ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రేణుక ఎల్లమ్మ, జమదగ్ని మహాముని కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య జరిగింది. గౌడ సంఘం నాయకులు, ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సమస్యలను పరిష్కరించాలి..



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న సంఘం నాయకులు

సిరిసిల్ల టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మంగళవారం హైదరాబాద్‌లో సిరిసిల్ల గంగపుత్ర సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని మంత్రి హామీనిచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలసిన వారులో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, సిరిసిల్ల గంగపుత్ర సంఘం నాయకులు ఉన్నారు.

ఇల్లు లేని నిరుపేదలకు న్యాయం చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం స్థలం, నిర్మాణానికి ఐదు లక్షలు అందించడంతో పాటు శాంతినగర్‌లో గత ప్రభుత్వం నిర్మించిన డబల్ బెడ్ రూమ్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్లాల్ శుక్లా కార్మిక భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో మూషం రమేష్ మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలో వెయ్యి మందికి పైగా ఇల్లు లేని నిరుపేదలు ఇబ్బందులకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వారికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని అనుకుంటే రెండేళ్లు వాస్తున్నా పట్టించుకున్న పరిస్థితి కనబడతలేదన్నారు. కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీపై నిర్లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. వెంటనే ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. సమావేశంలో నాగుల సత్యం, గాజుల మల్లేశం, స్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘ పాలకవర్గం కొనసాగింపు..

ఇల్లంతకుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట సహకార సంఘ పాలకవర్గాన్ని కొనసాగిస్తున్న జిల్లా సహకార అధికారి రామకృష్ణ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సహకార సంఘ చైర్మన్‌గా రొండ్ల తిరుపతిరెడ్డి, సభ్యులుగా గొడుగు తిరుపతి, కట్ట సుధాకర్‌రెడ్డి, నాయిని నవీన్‌కుమార్, కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, చల్ల నవీన్‌కుమార్‌రెడ్డి, గన్నారం వసంత, పల్లె సృజన్‌రెడ్డి, గజ్జల సత్తయ్య, పారిపెల్లి లక్ష్మి, కట్ట లచ్చయ్య, జంగిటి కొమురయ్యలు ఆరు నెలల పాటు పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు. మండలంలోని ఇల్లంతకుంట, గాలిపెల్లి సహకార సంఘాల పాలకవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు గతంలో ప్రకటించగా వీరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశం మేరకు వీరు పదవిలో కొనసాగాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు.

నాణ్యమైన సేవలందించాలి..

- జిల్లా సంక్షేమ అధికారి పి లక్ష్మీరాజం

సిరిసిల్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లాభోక్తులకు నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా సంక్షేమాధికారి పి లక్ష్మీరాజం అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని అంబేద్కర్ నగర్, బీవైనగర్, ఐసీడీఎస్ సెక్టార్‌లలో అంగన్‌వాడీ టీచర్ల సమీక్ష సమావేశం జరిగింది. ఇదే సందర్భంలో పదవీ విరమణ పొందిన ముగ్గురు అంగన్‌వాడీ టీచర్లు ఆయాలను సన్మానించారు. వారి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజం మాట్లాడుతూ సిరిసిల్లలో చాలా మంది అర్హులైన లబ్ధిదారులు ఉన్నారని వారందరిని అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయించాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు దివ్య, సుస్మిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి - తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో ప్రచార జాతా



సిరిసిల్లలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

సిరిసిల్ల రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యారంగాన్ని పరిరక్షించాలని తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ అలుగు బెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రభుత్వం విద్యారంగాన్ని పరిరక్షించాలని తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతాలో భాగంగా సిరిసిల్ల పట్టణంలో మంగళవారం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ముఖ్య కూడళ్లల్లో జరిగిన ప్రచార జాతా కార్యక్రమాల్లో నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రజలపై కూడా ఉందన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని, తరగతి గదికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలన్నారు. పాఠశాలలో మౌలిక వసతులను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పౌర స్పందన వేదిక ఉపాధ్యక్షురాలు మంగ, కార్యవర్గ సభ్యులు నాగమణి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధర్మనమూర్తి, రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు గుండమనేని మహేందర్‌రావు, కోశాధికారి అంబటి రమేష్, కార్యదర్శులు పాముల స్వామి, కోత్వాల్ ప్రవీణ్, తిరుపతి జాదవ్, సిరామరాజు, సిలువేరి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి..

ఉచిత చదువు పేరుతో మోసం చేస్తున్న

- కలెక్టరేట్‌లో ఆందోళన చేపట్టిన విద్యార్థులు



కలెక్టరేట్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఉచిత చదువు పేరుతో విద్యార్థులను మోసం చేస్తున్న డిగ్రీ కళాశాలలపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం విద్యార్థులు కలెక్టరేట్‌కు తరలివచ్చి ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్‌కు వస్తున్న విద్యార్థులను పోలీసులు ప్రధాన ద్వారం వద్దనే అడుకున్నారు. అయినా విద్యార్థులు మాత్రం కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవిస్తామంటూ కలెక్టరేట్‌లోకి వచ్చి ఆందోళన చేపట్టారు. సిరిసిల్ల పట్టణంలో 2021-22 సంవత్సరంలో హంస వాహిని డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసిన యాజమాన్యం అడ్మిషన్ల సమయంలో తమ ఇళ్లలోకి వచ్చి ఉచితంగా చదివిస్తామని పరీక్ష ఫీజులు కూడా చెల్లించాల్సిన అవసరం లేదని తమను కళాశాలలలో చేర్చుకున్నారని విద్యార్థులు తెలిపారు. 2022-23 సంవత్సరంలో ఒక సెమిస్టర్ పూర్తికాగానే నిర్వహణ సాధ్యం కాదని ఆ కళాశాలలో చదువుతున్న 550 మంది విద్యార్థులను వికాస్ డిగ్రీ కళాశాలలో కలిపేసి హంస వాహిని కళాశాల యాజమాన్యం చేతులు దులుపుకున్నారని వివరించారు. వికాస్ కళాశాలలో తమకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని కళాశాల యాజమాన్యం ప్రకటించిందన్నారు. వికాస్ డిగ్రీ కళాశాలలో తమకు రూ.5 వేల 500 ఇస్తామని ప్రకటించి డబ్బులు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం సిరిసిల్లలో అయ్యప్ప డిగ్రీ కళాశాలను నేతాజీ కళాశాలగా పేరును మార్చి విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామంటూ మోసానికి పాల్పడుతున్నారని, ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన నేతాజీ డిగ్రీ కళాశాలపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు అరవింద్, భవాని, భువన, కావ్య, వర్ష, పావణి, కళ్యాణి, స్వాతి, స్నేహ, అనన్య, స్నేహ, ఇందిరా, విద్యా తదితరులు పాల్గొన్నారు.

గోశాలలో కోడెల మృతిపై విచారణ జరిపించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి - కలెక్టర్‌కు వినతిపత్రం

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ఉన్న గోశాలలో కోడెల ఆకస్మిక మరణాలపై విచారణ జరిపించి దీనికి బాధ్యులైన ఆలయ ఈవోతో పాటు సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి కలిసి వేములవాడ గోశాలలో కోడెల మరణాలపై చర్చించి కోడెల మృతిపై విచారణ చేపట్టి మరణాలకు కారుకులైన వారిని సస్పెండ్ చేయాలని వినతి పత్రాన్ని అందించారు. కోడెల మృత్యువాతలకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న గోపి

ఆటో ట్రాలీ బోల్తా.. తప్పిన ప్రమాదం



బోల్తా పడిన గ్యాస్ సిలిండర్ల ఆటో ట్రాలీ

హుజూరాబాద్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సిలిండర్ గ్యాస్ లోడ్‌తో వెళ్తున్న ఆటో ట్రాలీని ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టగా తృటిలో ప్రమాదం తప్పింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్యాస్ సిలిండర్‌లతో వెళ్తున్న ఆటో ట్రాలీని వరంగల్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులో మంగళవారం ఢీకొట్టింది. దీంతో ట్రాలీ నడిరోడ్డుపై బోల్తా కొట్టింది. అందులో ఉన్న గ్యాస్ సిలిండర్లు చెల్లాచెదురయ్యాయి. కొన్ని సిలిండర్లు లీక్ అయ్యాయి. ట్యాంకర్ డ్రైవర్ తప్పించుకొని పారిపోయే ప్రయత్నం చేయగా ట్యాంకర్ టైర్ కింద గ్యాస్ సిలిండర్ చిక్కుకు పోవడంతో లారీ ముందుకు కదలలేదు. ఆటో ట్రాలీలో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, 108వాహనంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సిలిండర్లు చెల్లాచెదురు అయ్యాయి. ఆటోలో గ్యాస్ సిలిండర్లు ఉండటంతో ఏ జరుగుతుందోనని వాహనదారులు భయపడ్డారు. ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నవీన్ (ఫైల్)

ఇల్లంతకుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారంపేట గ్రామానికి చెందిన గొట్టం నవీన్ (26) అనే యువకుడు రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాలీఆటో నడుపుకుంటూ జీవించే నవీన్ సోమవారం మామిడి కాయలు తీసుకొని నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఇండ్లవాయి సమీపంలో అర్ధరాత్రి లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు.

ఇసుక లారీలను అడ్డుకున్న నాయకులు



ఇసుక లారీలను అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు

మానకొండూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఇసుక లారీలను అడ్డుకున్నారు. మండలంలోని ఊటూర్ మానేరు వాగులోని ఇసుక రీచ్ నుంచి సరఫరా చేస్తున్న ఇసుక లారీలతో రోడ్డు చెడిపోవడమే కాకుండా దుమ్ము, ధూళి, శబ్ద కాలుష్యం, ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇసుక లారీలను నూతనంగా నిర్మించే బైపాస్ నుంచి తరలించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, పిట్టల మధు, బోడ రాజశేఖర్, ఎస్‌కే అబూద్ నాయకులు పాల్గొన్నారు.



- దామిని యాప్ రూపొందించిన వాతావరణ శాఖ
- ఎరుపు, పసుపు, నీలి రంగుల ద్వారా పిడుగుపాటు సమాచారం

వెల్గటూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పిడుగు అనగానే ప్రతీ ఒక్కరు భయాందోళనకు గురి అవుతుంటారు. ఈ నేపథ్యంలో అనేక పరిశోధనలు చేసిన భారత వాతావరణ శాఖ పిడుగుపాటును ముందే పసిగట్టేలా ఓ యాప్‌ను ఆవిష్కరించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటరాలజీ (ఐఐటీఎం) ఆధ్వర్యంలో 'దామిని లైటింగ్ ఎలర్ట్' యాప్‌పై రూపొందించింది. పొలాల్లో పనులు చేస్తున్న సమయంలో, పశువుల కాపరులు పశువు లను మేపుతున్న సమయంలో అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడగానే సమీపంలో చెట్టు కిందికి వెళ్లి నిల్చుంటారు. ఎత్తైన చెట్టుకే పిడుగు వేస్తుందని తెలియక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పిడుగుపాటుతో పొంచి ఉన్న ప్రమాదాన్ని పసిగట్టే యాప్ ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చు.

● పిడుగుపాటును ఇలా గుర్తించవచ్చు..

మీరు ఉన్న ప్రదేశంలో పిడుగు ఎంత సమయంలో సంభవిస్తుందో హెచ్చరించేలా యాప్‌లో ఎరుపు, పసుపు, నీలం రంగుల్లో చూపిస్తుంది. దీని ద్వారా పిడుగు పాటు ప్రమాదాన్ని ముందే గుర్తించి ప్రాణాలు కాపాడుకోవచ్చు.

● ఎరుపు రంగు..

మీరు ఉన్న ప్రాంతంలో పిడుగుపడే అవకాశం ఉంటే 7 నిమిషాల ముందుగానే ఆ సర్కిల్ ఎరుపు రంగులోకి వస్తుంది.

● పసుపు రంగు..

మీరు ఉన్న ప్రాంతంలో 10 నుంచి 15 నిమిషాల లోపు పిడుగుపడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ పసుపు రంగుగా మారుతుంది.

● నీలం రంగు..

మీరు ఉన్న ప్రాంతంలో 18 నుంచి 25 నిమిషాల లోపు పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ నీలం రంగులో కనిపిస్తుంది.

● యాప్ డౌన్ లోడ్ చేసుకునే విధానం

స్మార్ట్ ఫోన్ కలిగిన ప్రతీ ఒక్కరు ప్లే స్టోర్ నుంచి దామిని లైటింగ్ ఎలర్ట్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. ప్లే స్టోర్‌లో దామిని యాప్ అని టైప్ చేయాలి. యాప్ ఓపెన్ కాగానే పేరు, మొబైల్ నంబర్, అడ్రస్, పిన్‌కోడ్ రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం జీపీఎస్ లొకేషన్‌లో యాప్‌ను వినియోగించే సమయంలో మీ ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందో, లేదో మూడు రంగుల్లో సూచిస్తుంది.

● పాటించాల్సిన జాగ్రత్తలు

- మొబైల్ సిగ్నల్స్ పిడుగు పడే అవకాశాన్ని ఎక్కువ కల్పిస్తాయి. మబ్బులు ఉన్న సమయంలో పంట పొలాల్లో మొబైల్ ఫోన్ వినియోగించకపోవడం మంచిది.
- వర్షం పడే సమయంలో విద్యుత్ స్తంభాలు, సెల్‌ఫోన్ టవర్లు, బోరు పంప్ సెట్లకు దూరంగా ఉండాలి.
- పిడుగులు పొడవైన చెట్ల మీద పడే అవకాశం ఎక్కువగా ఉండడంతో వర్షం కురిసే సమయంలో వాటి కింద ఉండవద్దు.

అన్నదాతలకు ఉపయోగకరం
-సాయికిరణ్, ఏవో వెల్గటూర్



పిడుగుపాటును ముందే పసిగట్టే దామిని యాప్ ప్రజలకు ముఖ్యంగా అన్నదాతలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. రైతులు ఈ యాప్‌ను వినియోగించేలా అవగాహన పెంచుకోవడం మంచిది. పిడుగుపడే అవకాశం ముందే గుర్తించి ప్రాణాలు కాపాడుకోవచ్చు.

వివాహిత ఆత్మహత్యపై బంధువుల ఆందోళన

● భర్త, అత్తమామల అరెస్ట్ ● గ్రామంలో పోలీసుల బందోబస్తు



భర్త ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న బంధువులు

సిరిసిల్ల క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని ఎలిగేడు మండలం ముప్పిడితోటకు చెందిన పురెల్ల ప్రవళ్లిక(28) ఆత్మహత్యకు ఆమె భర్త మద్దికుంట ప్రశాంత్ వేధింపులే కారణమంటూ మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరు గ్రామంలో పుట్టింటి వారు, బంధువులు ధర్నాకు దిగారు. పురెల్ల ప్రవళ్లికకు రెండేళ్ల క్రితం పెద్దూరుకు చెందిన ప్రశాంత్‌తో వివాహమైంది. వివాహ సమయంలో రూ.12లక్షల వరకట్నం, ఇతర లాంఛనాలు ఇచ్చారు. అయినప్పటికీ భర్త వేధింపులు భరించలేక తల్లిగారింటి వద్దనే మే 10న గడ్డిమందు తాగి ప్రవళ్లిక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు జూలపల్లి పోలీస్ స్టేషన్‌లో భర్త ప్రశాంత్‌తో పాటు ఆడపడుచులు, అత్త, మామలపై కేసు నమోదైంది. ఈ కేసులో నుంచి అత్త, మామ, ఆడపడుచులను తొలగించాలని వివాహ సమయంలో ఇచ్చిన వరకట్నం రూ.12లక్షలు, ఇతర లాంఛనాలకు సంబంధించిన ఖర్చుతో పాటు అన్ని కలిపి అదనంగా రూ.25 లక్షలు ఇవ్వాలని పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ జరిగింది. అయితే ప్రవళ్లికు పెట్టిన బంగారం ఎక్కడ ఉందనే దానిపై క్లారిటీ లేకపోవడంతో ఘర్షణకు దారితీసింది. చివరికి బంగారం విషయం తేలడంతో పెద్దమనుషుల సమక్షంలో రాసిన రాజీ కాగితాన్ని చింపేసి భర్త తరపున వెళ్లిన వారంతా ముప్పిడితోట నుంచి పెద్దూరుకు వచ్చేశారు. భార్య ప్రవళ్లిక ఆత్మహత్య చేసుకొని 25రోజు లైనప్పటికీ పోలీసులు ఎవరినీ అరెస్ట్ చేయలేదని ముప్పిడితోట నుంచి వాహనాలలో దాదాపు 50నుంచి 70మంది వరకు మహిళలు తరలి వచ్చి పెద్దూరులోని భర్త ప్రశాంత్ ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. ఈ ధర్నాతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో టౌన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ తమకు న్యాయం చేయాలని ఇంటి ఎదుట బైఠాయించిన ప్రవళ్లిక బంధువులు, మహిళలు పట్టుబట్టారు. చివరికి పోలీసు లు జోక్యం చేసుకొని సముదాయించినప్పటికీ వెంటనే భర్త, అత్త, మామలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఇక్కడి పోలీసులు జూలపల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో అక్కడి నుంచి వచ్చిన పోలీసులు భర్త ప్రశాంత్, అత్తమామలను అరెస్ట్ చేసి జూలపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నాటుసారా బట్టీలపై పోలీసుల దాడి

ఓదెల, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలనూరులో సోమవారం రాత్రి పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ ఆధ్వర్యంలో నాటుసారా బట్టీలపై దాడి చేశారు. 500 లీటర్ల బెల్లం పానకం, ఐదు లీటర్ల నాటు సారా పట్టుకోగా తయారు చేస్తున్న బోదాసు పద్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను పాల్పడితే ఉపేక్షించేది లేదని, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడం, నాటుసార తయారు చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సెల్ నంబర్ 8712656514కు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ కిషన్, కానిస్టేబుళ్ల రాజేందర్, రాములు పాల్గొన్నారు.

ఎల్ఎండీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మానేరు జలాశయంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. మంగళవారం జలాశయం మొదటి గేట్ వద్ద నీటిపై తేలియాడుతున్న వ్యక్తి మృతదేహాన్ని లేక్ పోలీసులు గుర్తించి కొత్తపల్లి పోలీసులకు సమాచారం అందించారు. చనిపోయిన వ్యక్తి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, బ్లూ జీన్‌పాయింట్, బ్లాక్ అండ్ వైట్ చెక్స్ ఫుల్‌షర్ట్ ధరించాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, గుర్తించినవారు కొత్తపల్లి పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గంగాధర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలం ఆచంపల్లిలో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం కొత్తపల్లి మండలం ఎలగందుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామానికి రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 03: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,550 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ఏడుగురు రైతులు 85క్వింటాళ్లు విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ట ధర రూ.7,550, కనిష్ఠ ధర రూ.7,400 చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు.

గంజాయి పట్టివేత



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బావుపేటలో 1.2 కిలోల గంజాయి పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి ఆధ్వర్యంలో బావుపేటలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఒక టిఫిన్‌సెంటర్ వద్ద రాంపర్వేష్ సాయిని(40) అనే బీహార్‌కు చెందిన గ్రానైట్ కార్మికుడు అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 1.2 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితుడు బీహార్ నుంచి గంజాయిని బావుపేటకు తీసుకువచ్చి ఇక్కడి యువతకు 500 రూపాయలకు ఒక పాకెట్ చొప్పున విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితుడి అరెస్టు చేసినట్లు, గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సీఐతో పాటు ఎస్సై సాంబమూర్తి, సిబ్బందిని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, కరీంనగర్ రూరల్ ఏఎస్‌పీ శుభం ప్రకాశ్ అభినందించారు.

ఇంటికి నిప్పంటించిన దుండగులు



కాలిపోయిన వస్తువులు

వేములవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని మార్కండేయ నగర్‌లో ఎంగ్రాల దేవయ్య ఇంటికి గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు పైఅంతస్తు, కింద భాగంలోనూ డీజిల్‌ను చల్లి నిప్పంటించినట్లు అనుమానిస్తున్నారు. ఇంట్లో అద్దెకు ఉన్న వ్యక్తి కాలుతున్న వాసన గమనించి బయటకు వచ్చి చూడగా అప్పటికే కాలుతున్న వస్తువులను చూసి ఇంటి యజమానికి సమాచారం అందించడంతో సకాలంలో మంటలను ఆర్పారు. ఈ సంఘటనపై వేములవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు దేవయ్య తెలిపారు.

ఏసీబీ వలలో రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్

● భూమి రిజిస్ట్రేషన్‌కు రైతు నుంచి రూ.15 వేలు లంచం డిమాండ్ ● రూ.10వేలు తీసుకుంటుండగా పట్టివేత



ఏసీబీకి పట్టుబడిన రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్ గణేష్, డాక్యుమెంట్ రైటర్ ఎండీ ముజాఫర్

రాయికల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతు నుంచి డాక్యుమెంట్ రైటర్ ద్వారా రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా రాయికల్ మండల ఇన్‌చార్జి తహసీల్దార్ గణేష్‌ను మంగళవారం కరీంనగర్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాయికల్ మండలం సింగరావుపేట గ్రామ శివారులోని 42.5 గుంటల వ్యవసాయ భూమిని రవి అనే రైతు ఇతరులకు విక్రయించాడు. అనంతరం భూమిని కొన్నవారికి రిజిస్ట్రేషన్ చేసేందుకు డాక్యుమెంట్ రైటర్ ఎండీ ముజాఫర్‌ను మూడు రోజుల క్రితం కలిశాడు. రైతు విక్రయించిన భూమిలో 16 గుంటలు కెనాల్ భాగానికి వెళ్తుందని చెప్పి ఇన్‌చార్జి తహసీల్దార్ రూ.15 వేలు లంచం డిమాండ్ చేశాడు. ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ ద్వారా రూ.10 వేలు ఇచ్చేందుకు అంగీకరించిన రైతు రవి ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఏసీబీ అధికారులు సూచన మేరకు మంగళవారం డాక్యుమెంట్ రైటర్‌కు బాధితుడు రవి రూ.10 వేలు ఇచ్చాడు. అనంతరం డాక్యుమెంట్ రైటర్ ఎండీ ముజాఫర్ నుంచి రూ.10 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్, డాక్యుమెంట్ రైటర్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు పంపినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు లేదా వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా ఫిర్యాదు చేయాలని డీఎస్పీ సూచించారు.

తండ్రిని కారుతో ఢీకొట్టి హత్య చేసిన కుమారుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య

చందుర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి తల్లిని వేధిస్తున్నాడని కక్ష గట్టి తండ్రిని హత్య చేసిన సంఘటనలో నిందితుడిని మంగళవారం చందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సీఐ వెంకటేశ్వర్లు హత్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సీఐ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలం దేవునితండాకు చెందిన జాటోత్ తిరుపతి తన భార్యతో తరుచూ గొడవ పడుతుండేవాడని, గొడవల కారణంగా తిరుపతి కొడుకు జటోత్ రాజేష్ తన తండ్రిపై పలుమార్లు దాడి చేశాడు. దాడి సంఘటనలపై రాజేష్‌పై చందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదు అయినాయని, ఆ కేసులు కోర్టులో ట్రయల్‌లో ఉన్నాయన్నారు. ఈ నెల 2 మధ్యాహ్నం సమయంలో తిరుపతి మళ్లీ తన భార్యతో గొడవపడుతున్నాడని సమాచారం అందడంతో, ఆవేశంతో రాజేష్ తన కారులో తన ఇంటికి వస్తుండగా, తండ్రి తిరుపతి రోడ్డుపై నిల్చోని ఉండగా, తరచూ ఇలాగే గొడవలు చేస్తున్నాడని కక్ష గట్టి తన కారుతో తన తండ్రిని బలంగా ఢీకొట్టి తిరుపతిపైకి పలుమార్లు కారును ఎక్కించగా స్పృహ తప్పి రక్తం మడుగులో పడిపోయాడు. స్థానికులు అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్‌లు పేర్కొన్నారు.

తండ్రిని కక్ష పూరితంగా హత్య చేసిన రాజేష్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కారును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసును త్వరగా విచారించి నేరస్తుడైన రాజేష్‌కు కోర్టు ద్వారా శిక్ష పడేలా కృషి చేస్తానని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.



పేరు నమోదు చేసుకుంటే పలు ప్రయోజనాలు

గణేశ్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ యువత కోసం మై భారత్ పోర్టల్ అందుబాటులోకి తెచ్చింది. 15 నుంచి 29 ఏళ్లలోపు యువతీ, యువకులు ఇందులో పేర్లు నమోదు చేసుకుంటున్నారు. నిరుద్యోగ యువత సాధికారత సాధించడంతో పాటు వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుంది. ఇందులో దేశవ్యాప్తంగా విద్య, ఉద్యోగావకాశాలు, పలు రకాల కోర్సులు, తదితర అంశాలపై ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తున్నారు. www.mybharath.gov.in వెబ్‌సైట్లో నమోదుకు అవకాశం కల్పించారు. ఈ వెబ్‌సైట్‌లోకి వెళ్లి రిజిస్టర్ నౌ ఆప్షన్‌ను క్లిక్ చేస్తే వివరాలు అడుగుతుంది. ఆ వివరాలన్నీ నమోదు చేస్తే రిజిస్టర్ అవుతుంది. తర్వాత వివిధ కార్యక్రమాల అప్‌డేట్స్ రిజిస్టర్ చేసుకున్న వారికి మెసేజ్, ఈ మెయిల్ రూపంలో వస్తాయి. పోర్టల్ లో పేర్లు నమోదు చేసుకున్న యువతను నాలుగు ప్రధాన అంశాలతో అనుసంధానం చేస్తున్నారు.

- ● ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన అర్హతలపై అవగాహన కల్పించడం.
- ● ఎంచుకున్న రంగంలో నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు అవకాశాలు, వసతులను వివరించడం.
- ● సామాజిక బాధ్యత పెంపొందించేందుకు యువత ఉజ్వల భవిష్యత్తు లక్ష్యంగా వివిధ సంస్థల భాగస్వామ్యంతో కార్యక్రమాలు చేపట్టడం.
- ● వ్యాపారాల్లో యువత రాణించేలా ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ)లో రాయితీ ఎలా పొందాలన్న సమాచారం పోర్టల్లో వ్యాపార, అందుబాటులో ఉంటుంది. పారిశ్రామికవేత్తలతోనూ మాట్లాడే అవకాశం కల్పించి సందేహాలు నివృత్తి చేస్తారు.

● ఉపాధికి బాటలు..

డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువతలో నైపుణ్యం ఉన్నా వారికి సరైన ప్రోత్సాహం అందడం లేదు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలున్నా అందుకోలేకపోతున్నారు. ఆర్థిక స్థోమత లేక పరిశ్రమల స్థాపనలో ఇబ్బందులు పడుతున్నారు. వీటిని అధిగమించేందుకు మై భారత్ పోర్టల్ వేదిక కానుంది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఇతర ఉన్నత విద్య చదువుతున్న వారి ప్రతిభ ఆధారంగా ఉపాధి పొందేందుకు మార్గ నిర్దేశం చేయనున్నారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి
- వెంకట రాంబాబు, ఎన్‌వైకే జిల్లా యువజన అధికారి



మై భారత్ పోర్టల్ ప్రయోజనాలపై విద్యా సంస్థల్లో ప్రచారం చేస్తున్నాం. జిల్లాలోని యువతీ, యువకులు తమ పేర్లు పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

తాగుడుకు బానిసై యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసగా మారిన యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామానికి చెందిన బాస కరుణాకర్(31) తల్లిదండ్రులతో కలిసి కరీంనగర్ మారుతీ నగర్‌లో ఓ ఇంటిలో అద్దెకుంటున్నాడు. తండ్రితోపాటు గ్రానైట్ ఫ్యాక్టరీలో కూలీగా పని చేసేవాడు. ప్రతి రోజు మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ పడేవాడు. గత నెల 30న తండ్రి, సోదరి బంధువుల వివాహానికి హైదరాబాద్ వెళ్లారు. తల్లితోపాటు కరుణాకర్ ఇంటి వద్ద ఉన్నాడు. సోమవారం రాత్రి 8 గంటలకు కరుణాకర్ మద్యం తాగి వచ్చి భోజనం చేసి పడుకున్నాడు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ఇంటి ముందు రోడ్డుపై కాలిన గాయాలతో యువకుడు మృతి చెంది ఉండడాన్ని గమనించి స్థానికులు గుమిగూడారు. అక్కడికి వెళ్లిన తల్లి యువకుడిని తన కొడుకు కరుణాకర్‌గా గుర్తించింది. ఆత్మహత్యకు ముందు 'నేను చాలా దూరం వెళుతున్నాను.. చాలా తప్పు చేశాను. కాళ్ల మొక్కడం, దండంపెట్టడం తప్ప చేసేది ఏమీ లేదు. అమ్మ, నాన్నలను జాగ్రత్తగా చూసుకోవాలి' అని కరుణాకర్ తెల్లవారు జామున 3:54 గంటలకు తన సోదరికి వాట్సప్‌లో వాయిస్ మెసేజ్ పంపించాడు. తాగుడుకు బానిసగా మారి నిత్యం కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్న కరుణాకర్ తప్పుచేశానని గ్రహించి క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి మధు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి రైతు మృతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్‌లో రైతు కరికె నాంపల్లి(65) ప్రమాదవశాత్తు తన వ్యవసాయ బావిలో పడి మంగళవారం మృతి చెందాడని పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. వారి కథనం మేరకు... గ్రామంలోని నాంపల్లి తనకున్న రెండెకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తుండేవాడు. యాసంగి వరి పంట కోత అనంతరం వానాకాలం పంట సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్నాడు. వ్యవసాయ బావి చుట్టూ ఉన్న ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. చీకటి పడినా భర్త నాంపల్లి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య శంకరవ్వ వ్యవసాయ పొలం వద్దకు చేరుకుంది. చుట్టుపక్కల గాలించడంతో వ్యవసాయ బావి గట్టు వద్ద చెప్పులు కనిపించాయి. కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు అక్కడకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో నాంపల్లి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య శంకరవ్వ, వివాహమైన కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రాజన్న కోడెల సంరక్షణకు పకడ్బందీ చర్యలు

● కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా



తిప్పాపూర్ గోశాలలో ఉన్న రాజన్న కోడెలు

వేములవాడ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలలో అకాల వర్షాలు, అనారోగ్య కారణాలు, పరిమితికి మించి కోడెలు ఉండటంతో కోడెల సంరక్షణపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం గోశాలను సందర్శించి దగ్గరుండి పలు పనులను చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాలలో పక్కా ప్రణాళికతో పనులు చేయిస్తున్నామన్నారు. గోశాల ఆవరణలో గుంతలు పడిన చోట, బురద, మిగతా స్థలాల్లో మొరం పోయించి చదును చేయించామన్నారు. కోడెలకు మెరుగైన దాణా, పచ్చి గడ్డి అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసి, త్వరగా అందేలా ఏర్పాట్లు చేశామని, ఐదు వెటర్నరీ వైద్యుల బృందం గోశాలలో ఉండి సేవలు అందిస్తున్నారన్నారు. పచ్చి గడ్డి సరఫరా కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపి రోజు సరఫరా చేసే ఒక ట్రాక్టర్ గడ్డికి బదులుగా రోజు 10 టన్నుల (5ట్రాక్టర్‌ల) పచ్చి గడ్డిని అందించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

అనారోగ్యంతో మరో ఆరు కోడెల మృతి

● మరో నాలుగు కోడెల అస్వస్థత ● ఇప్పటికీ 26 మృతి

సిరిసిల్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం తిప్పాపూర్ గోశాలలో అనారోగ్యానికి గురైన మరో ఆరు కోడెలు మంగళవారం మృతిచెందాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. రాజన్న కోడెల హెల్త్ బులిటెన్‌ను ఆయన విడుదల చేశారు. అకాల వర్షాలు, అనారోగ్య పరిస్థితుల వల్ల తిప్పాపూర్ గోశాలలో మొదటి రోజు 8 కోడెలు, రెండో రోజు 5 కోడెలు, మూడో రోజు 4 కోడెలు, నాలుగో రోజు 3 కోడెలు, మంగళవారం 6 కోడెలు మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు గోశాలలో 26 కోడెలు మృతిచెందినట్లు తెలిపారు. ప్రస్తుతం గోశాలలో 1300 పశువుల్లో 14 పశువులు అనారోగ్యంతో బాధపడుతుండగా, కొత్తగా మరో 4 అనారోగ్యం బారిన పడ్డాయని, డాక్టర్లు వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. చిన్న వయస్సు గల పశువులు, పెద్ద వయస్సుల గల పశువులు ఒకేచోట ఉండడం వల్ల మరణాలు సంభవిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు సమర్పించే కోడెలు తప్పనిసరిగా సంవత్సరన్నర కంటే ఎక్కువ వయస్సు ఉండాలని సూచించారు.

బద్ది పోచమ్మకు బోనం మొక్కులు



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీబద్ది పోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించి ఆలయంలోకి ప్రవేశించారు. ముందుగా అమ్మవారికి పట్నాలు వేసి నూతన వస్త్రాలతో ఒడిబియ్యాన్ని సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పాడిపంట, పిల్లాపాపలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు.

ఖని బస్టాండ్ నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్ జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ నుంచి ఈ నెల 9న తమిళనాడులోని అరుణాచలంకు ప్రత్యేక బస్సు నడిపిస్తున్నట్టు గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం నాగభూషణం తెలిపారు. ఈ నెల 9న మధ్యాహ్నం 3 గంటలకు గోదావరిఖని బస్టాండ్ నుంచి బయలుదేరి పెద్దపల్లి, కరీంనగర్ మీదుగా కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, మహాలక్ష్మి టెంపుల్, వేలూరు పుణ్యక్షేత్రాల గుండా 10న రాత్రి 10గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. అరుణచల గిరి ప్రదక్షిణ అనంతరం 11న సాయంత్రం 3 గంటలకు తిరుగు ప్రయాణంలో జోగులాంబ మీదుగా 12న సాయంత్రం 6 గంటలకు గోదావరిఖనికి చేరుకుంటుందన్నారు. గోదావరిఖని నుంచి అరుణాచలంకు పెద్దలకు రూ.4,850, పిల్లలకు రూ.4100, కరీంనగర్ నుంచి పెద్దలకు రూ.4,500, పిల్లలకు రూ.3,800 ధర నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 7013504982, 7989847927 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేషన్ పంపిణీలో మారిన నిబంధనలు



- కేంద్రం, రాష్ట్రానికి వేర్వేరుగా వేలిముద్రలు
- బియ్యం పంపిణీలో జాప్యం
- లబ్ధిదారులకు ఇబ్బందులు

చొప్పదండి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలోని రాంనగర్ కు చెందిన అనిత శ్రీరామ టాకీస్ సమీపంలోని రేషన్ షాప్‌నకు ఆదివారం వచ్చింది. మూడు నెలల బియ్యం ఒకేసారి వస్తాయని ఆమె సంతోషంతో ఉంది. అప్పటికే అక్కడ 50 మంది వరకు లబ్ధిదారులు ఉండడంతో రేషన్ కార్డులను వరుస క్రమంలో పెట్టాడు డీలర్. రెండు గంటల వరకు తన నంబర్ వస్తుందని అనిత ఎదురు చూసింది. ఆదివారం ఆమె నంబర్ రాలేదు. సోమవారం గడిచింది. మంగళవారం సాయంత్రం వరకూ ఆమె వంతు రాలేదు. దీంతో నిరాశగా ఆమె వెనుదిరిగింది. ఇందుకు కారణం మారిన నిబంధనలు. చొప్పదండి మండలంలోని అన్ని రేషన్ దుకాణాల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది.

● మూడు నెలల బియ్యం పంపిణీతో ముప్పుతిప్పలు

ఒక నెలకు సంబంధించి లబ్ధిదారుడు రెండు సార్లు వేలిముద్రలు వేయగా డీలర్ రెండు సార్లు తూకం వేస్తున్నాడు. మూడు నెలల బియ్యం కోసం ఆరు సార్లు వేలిముద్రలు, ఆరు సార్లు తూకం వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కో లబ్ధిదారుడుకి బియ్యం పంపిణీ కోసం 15 నుంచి 20 నిముషాల సమయం పడుతుంది. ప్రతి రోజు 20 మందికి మించి బియ్యం పంపిణీ జరుగడం లేదని డీలర్లు, లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒకే రోజు వందలాది మందికి బియ్యం పంపిణీ చేసిన డీలర్లు మారిన నిబంధనలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతు న్నారు. మండలంలోని ప్రతి రేషన్ షాప్ ముందు ప్రజలు బారులు తీరి ఉండి రోజుల తరబడి బియ్యం కోసం పడిగాపులు కాయల్సిన పరిస్థితులు ఏర్పాడ్డాయి.

● బయోమెట్రిక్‌లో ఆలస్యం

రేషన్ బియ్యం పంపిణీ లో ఈ పాస్ విధానంలో ప్రతి లబ్ధిదారుడు తప్పనిసరిగా బయో మెట్రిక్ వేలి ముద్ర వేయాల్సి ఉంటుంది. ఈ నెల నుంచి కొత్త నిబంధనలు అమలు చేయాలని అధికారులు ఆదే శించారు. ప్రతి లబ్ధిదారుడు రెండు సార్లు వేలి ముద్రలు వేయాల్సి ఉంటుంది. ఒక సారి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 5 కిలోల బియ్యానికి, మరో సారి రాష్ట్రం ఇచ్చే కిలో బియ్యానికి వేలి ముద్రలు వేయాలి. ఇదే సమయంలో డీలర్ రెండు సార్లు తూకం వేసి లబ్ధిదారుడి ఫోన్ నంబర్ నమోదు చేయాలి. డీలర్ల వద్ద మొబైల్ సిగ్నల్ సరిగ్గా అందక సర్వర్ సమస్య ఏర్పడుతోంది. దీంతో బియ్యం పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇక పై ప్రతి నెల ఇదే విధంగా బయో మెట్రిక్‌లో లబ్ధిదారులు వేలుముద్రలు వేయాల్సి ఉంటుంది. ఈ సారి మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం ఒకే సారి లబ్ధిదారులకు అందజేస్తున్నారు.



రోజు రేషన్ షాప్ వద్ద ఉండాల్సి వస్తుంది

\- వనిత, చొప్పదండి



మూడు నెలల బియ్యం ఒకే సారి వస్తున్నాయని ఎంతో సంతోష పడ్డాను. మూడు రోజులుగా షాప్ వద్దనే ఉంటున్నాను. బియ్యం పంపిణీలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇంతకు ముందు ఎప్పుడైన ఒకే రోజులో బియ్యం తీసుకుపోయే వాళ్లం. ఇప్పుడు నిబంధనలు మారాయని అంటున్నారు. తొందరగా బియ్యం అందేలా అధికారులు చూడాలి.

కొత్త నిబంధనలతో ఇబ్బందులు..

\- కొక్కుల రాంమోహన్, డీలర్, చొప్పదండి



రేషన్ బియ్యం పంపిణీ లో కొత్త నిబంధనలు అమలు చేయడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కో లబ్ధిదారుడికి ఇరవై నిముషాల సమయం పడుతుంది. షాప్ ఎదుట లబ్ధిదారులు బారులు తీరి ఉంటున్నారు. ఆరు సార్లు తూకం వేసి వేలిముద్రలు నమోదు చేయడంతో బియ్యం పంపిణీలో చాలా జాప్యం జరుగుతుంది.

హోరాహోరీగా ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలు

\- కరీంనగర్ టౌన్, కరీంనగర్ రూరల్, వేములవాడ జట్ల విజయం
\- కరీంనగర్ టౌన్ క్రీడాకారుడు రిత్విక్ సూర్య డబుల్ సెంచరీ



రిత్విక్ సూర్య

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా అండర్-25 లీగ్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మంగళవారం ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లలో కరీంనగర్ టౌన్, కరీంనగర్ రూరల్, వేములవాడ జట్లు గెలుపొందాయి. జిల్లా కేంద్రంలోని సెయింట్ అల్ఫోన్స్ మైదానంలో కరీంనగర్ రూరల్, పెద్దపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్ రూరల్ జట్టు 5 వికెట్ల తేడాతో పెద్దపల్లి జట్టుపై విజయం సాధించింది. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో కరీంనగర్ టౌన్, హుజూరాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్ టౌన్ జట్టు 224 పరుగుల భారీ ఆధిక్యంతో గెలుపొందింది. వేములవాడలో వేములవాడ, జగిత్యాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వేములవాడ జట్టు నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్‌లను కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు ఆగమరావు, మురళీధర్‌రావు, మహేందర్ గౌడ్, మనోహర్‌రావు, నితిన్ పర్యవేక్షించారు.

● ఆకట్టుకున్న రిత్విక్ సూర్య

కరీంనగర్ టౌన్ జట్టుకు చెందిన రిత్విక్ సూర్య హుజూరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 30 ఫోర్లు, 10 సిక్స్‌లతో 220 పరుగులు చేసి అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ జట్టుకే చెందిన మన్నిత్‌రెడ్డి హ్యాట్రిక్ సాధించాడు.

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయం వద్ద భక్తులు

మల్యాల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. విద్యాసంస్థలు త్వరలోనే పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో వేలాదిగా తరలివచ్చిన వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. గంటల తరబడి క్యూలైన్‌లలో వేచి ఉండి అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. క్యూలైన్‌ల వద్ద నీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గంలో వాహనాలు బారులు తీరగా జైజంక్షన్, పార్కింగ్ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి భక్తులు ఇబ్బంది పడ్డారు.

రెండిళ్లలో చోరీ

గంగాధర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో రెండు ఇళ్లలో చోరీ జరిగినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డం వీరారెడ్డి గత నెల 31న కరీంనగర్‌లో బంధువుల వివాహం ఉండగా ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. మంగళవారం వీరారెడ్డి పక్కింటి వారు ఫోన్‌చేసి మీ ఇంటి తాళం పగులగొట్టి ఉంది, తలుపులు తీసి ఉన్నాయని తెలిపారు. వీరారెడ్డి మంగళవారం వచ్చి చూడగా తాళం పగుల గొట్టి, ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో బీరువాలో దాచిన 2లక్షలు చోరీకి గురయ్యాయి. వీరారెడ్డి ఇంటికి కొద్ది దూరంలోని కనకట్ల ఎల్లవ్వ ఇంట్లో నాలుగు వేల విలువైన రెండు ఇత్తడి బిందెలు, రెండు బియ్యం బస్తాలు ఎత్తుకెళ్లారు. ఏఎస్పీ శుభం ప్రకాశ్ ఆధ్వర్యంలో బాధిత ఇళ్లను పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో..

● ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ● ఏడాది ప్రోగ్రెస్ రిపోర్టు విడుదల



ఎంపీగా గెలిచిన తర్వాత ర్యాలీలో బండి సంజయ్‌కుమార్ (ఫైల్)

కరీంనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర మంత్రిగా బిజీగా ఉన్నా నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కరీంనగర్ ఎంపీగా ఏడాది కాలం పూర్తవడంతో ఆయన తన ప్రోగ్రెస్ రిపోర్టును మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీగా రెండో సారి ఎన్నికై ఏడాది కాలం పూర్తవుతుందన్నారు. రెండో సారి ఎన్నికైన తనకు ప్రధాని మోదీ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా అవకాశం కల్పించారన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయలు మంజూరు చేయించామని తెలిపారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న కరీంనగర్-జగిత్యాల రహదారి విస్తరణకు రెండు వారాల్లో టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు.

● ఉపాధి హామీ కింద ప్రతి మండలానికి రూ. 2 కోట్లు

జాతీయ ఉపాధి హామి పథకం కింద ప్రతి మండలానికి రెండు కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఆయా మండలాల్లో రోడ్లను నిర్మించామన్నారు. సగటున ఒక్కో గ్రామానికి ఐదు లక్షల రూపాయలు అంతర్గత రోడ్లకు ఖర్చు చేశామని ప్రకటించారు. కరీంనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం 33 కోట్లకు పైగా ఖర్చు చేసి సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. కరీంనగర్, జమ్మికుంట ఆర్వోబీల నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని సంబంధిత అధికారులతో సమీక్షించి వేగవంతంగా పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆగస్టు నాటికి జమ్మికుంట ఆర్వోబీ నిర్మాణం పూర్తి కాకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించామని తెలిపారు. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణంలో ఇబ్బందులను అధిగమించేందుకు రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయించామన్నారు.

● త్వరలో వారానికి నాలుగు సార్లు తిరుపతి రైలు

కరీంనగర్-తిరుపతి రైలును వారానికి నాలుగుసార్లు నడిచేలా త్వరలో సానుకూల నిర్ణయం రాబోతుందన్నారు. సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో సైనిక్ స్కూల్స్ ఏర్పాటు కోసం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు వినతి పత్రం అందించామన్నారు. తన వినతిపత్రానికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. సిరిసిల్ల, హుస్నాబాద్ ప్రాంతాల్లో రెండు నవోదయ స్కూళ్లు ఏర్పాటు కాబోతున్నాయన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో టెక్నికల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని, దీనిపై కేంద్రం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ప్రసిద్ధ ఆలయాలను టూరిజం సర్క్యూట్‌గా మార్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అందులో భాగంగా సాక్షి (ఎస్‌ఏఎస్‌సీఐ) పథకం కింద అధ్యాత్మిక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసిందని చెప్పారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో లా కళాశాల ఏర్పాటు కోసం వీసీ, మాజీ మేయర్ సునీల్‌రావులతో కలిసి కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్‌ను కలిసి మంజూరు చేయించామన్నారు. ఈ ఏడాది నుంచి లా కాలేజీలో అడ్మిషన్లు కూడా ప్రారంభం కాబోతున్నాయన్నారు. అంబేద్కర్ స్టేడియంలో సింథటిక్ పార్క్, స్పోర్ట్స్ రిక్రియేషన్ సౌకర్యాలు కల్పించాలని చేసిన ప్రతిపాదనకు కేంద్ర క్రీడా శాఖ సుముఖత వ్యక్తం చేసిందన్నారు. కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటవుతుందన్నారు.

● డంప్‌యార్డ్ సమస్యకు త్వరలో పరిష్కారం

కరీంనగర్ ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న డంప్‌యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం హామీ ఇవ్వడంతో పాటు, నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఏడాదికాలంగా ఐదు కోట్ల రూపాయలతో వేములవాడ, హుస్నాబాద్, హుజూరాబాద్, జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రులకు అత్యాధునిక వైద్య పరికరాలను అందించామన్నారు. పదో తరగతి వరకు చదివే ఆరు వేల మంది బాలికలకు ప్రత్యేకంగా సైకిళ్లు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కేంద్ర మంత్రిగా బిజీగా ఉన్నప్పటికి ఓట్లేసి భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేందుకు ప్రయత్నిస్తున్నానన్నారు.

ఎంకామ్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ ఉచిత కోచింగ్

గణేశ్‌నగర్,జూన్3(ఆంధ్రజ్యోతి): ఎంకామ్ ప్రవేశ పరీక్షకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభించినట్లు వక్తలు తెలిపారు. ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కరీంనగర్, కాకతీయ గవర్నమెంట్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) హనుమకొండ ఆధ్వర్యంలో తెలంగాణ కామర్స్ అసోసియేషన్ సౌజన్యంతో ఎంకామ్ ప్రవేశ పరీక్ష 2025 కోసం మంగళవారం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ ప్రభుత్వ కళాశాలలు, అధ్యాపకులు ఉత్తమ సేవలు అందించడానికి ముందుంటారన్నారు. సీనియర్ ప్రొఫెసర్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఉస్మానియా యూనివర్సిటీ, తెలంగాణ కామర్స్‌అసోసియేషన్ ప్రెసిడెంట్ చెన్నప్ప, జీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్ రెడ్డి, ప్రొఫెసర్ కె. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఐదు రోజుల జైలు శిక్ష

కోల్‌సిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడుపుతూ రెండోసారి పట్టుబడిన శనిగరపు సుమన్ అనే వ్యక్తికి మంగళవారం గోదావరిఖని రెండవ అదనపు న్యాయస్థానం న్యాయమూర్తి వెంకటేష్ ఐదు రోజుల జైలు శిక్ష విధించారు. దీంతో అతన్ని కరీంనగర్ జైలుకు తరలించినట్టు ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. మరో నలుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్టు పేర్కొన్నారు.

క్రీడా పాఠశాల పిలుస్తోంది..



కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్

- హాకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో స్పోర్ట్స్ స్కూల్స్
- నాలుగో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్
- రాష్ట్రవ్యాప్తంగా 60 మంది బాలురు, 60 మంది బాలికలకు అవకాశం
- జూలై 8 నుంచి హాకీంపేటలో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులుగా ఎదగాలనుకునేవారికి విద్యార్థులలకు మంచి అవకాశం క్రీడా పాఠశాలలు. రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాల్లో 21025-26 విద్యాసంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్రంలో హాకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో స్పోర్ట్స్ స్కూల్స్ ఉన్నాయి. ఈ సంవత్సరానికి నాలుగు తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభచాటి ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు ఈ పాఠశాలల్లో ప్రవేశం పొందుతారు. రాష్ట్రంలోని మూడు పాఠశాలల్లో 60 మంది బాలురు, 60 మంది బాలికలు నాలుగో తరగతిలో చేరేందుకు అవకాశం ఉంది. మండల జిల్లా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించి 20 మంది బాలురను, 20 మంది బాలికలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు.

● ప్రవేశాల షెడ్యూల్...

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు మండల స్థాయిలో ఎంపిక పోటీలను ఆయా మండల కేంద్రాల్లో ఈ నెల 16 నుంచి 25 వరకు నిర్వహిస్తారు. మండలస్థాయిలో ఎంపికైన క్రీడాకారు లకు జిల్లాస్థాయిలో ఎంపిక పోటీలను జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 27 నుంచి 30 వరకు నిర్వహిస్తారు. జిల్లాస్థాయిలో ఎంపిక చేసిన 20 మం ది బాలురను, 20 మంది బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. రాష్ట్రస్థాయి పోటీలు హాకీంపేటలోని క్రీడా పాఠశాలలో జూలై 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

● విద్యార్థులకు నిర్వహించే శారీరక పరీక్షలు...

మండలస్థాయిలో మొదట విద్యార్థుల అర్హత పత్రాలను పరిశీలించి బరువు, ఎత్తు, ఫ్లెక్సిబిలిటీ అంశాల్లో పరీక్షలను నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలోనూ ఇవే పరీక్షలను నిర్వహిస్తారు. వీటితోపాటు విద్యార్థులకు అన్ని దశల్లో 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగు, 610 షటిల్ రన్, మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. ఒక్కో అంశానికి మూడు మార్కుల చొప్పున ఏడు అంశాలకు 21 మార్కులు ఉంటాయి. విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహిస్తారు. వయస్సు ధ్రువీకరణ పరీక్షతోపాటు శారీరక పటుత్వం, బొక్కల పటిష్టత అంశాలను పరీక్షిస్తారు.

- మొత్తం పరీక్షల్లో 15 మార్కులకుపైగా వచ్చిన విద్యార్థులందరు అర్హులుగా భావిస్తారు.
- విద్యార్థుల వయస్సు 8 నుంచి 9 సంవత్సరాలు ఉన్నవారు అర్హులు.

● క్రీడా విభాగాల్లో శిక్షణ...

అథ్లెటిక్స్, ఆర్చరీ, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, రోయింగ్, వాలీబాల్, జూడో, ఫెన్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, రెజ్లింగ్ క్రీడాంశాలతోపాటు ఖోఖో, కబడ్డీ అంశాల్లో ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ అందిస్తారు. క్రీడా పాఠశాలలో ఉత్తమమైన క్రీడాకారులుగా ఎదిగిన వారికి రైల్వే, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, పోలీస్, బ్యాంక్స్, పోస్టల్ శాఖ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా కోచ్‌లు, కార్పొరేట్ సెక్టార్లలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుంది.

● కావలసిన పత్రాలు...

విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులతోపాటు మున్సి పాలిటీ, పంచాయతీ నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. ఆధార్ కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్, మూడో తరగతి పాస్ సర్టిఫికెట్, మూడో తరగతి ప్రగతి పత్రంతో జిల్లా, రాష్ట్ర ఎంపికలకు హాజరు కావాలి.

● సదుపాయాలు

క్రీడా పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రభుత్వం అనేక సదుపాయాలను కల్పిస్తుంది. ఉచిత విద్య, భోజన, వసతి సౌకర్యాలు, ప్రతి సంవత్సరం రెండు ట్రాక్ సూట్లతోపాటు, క్రీడా దుస్తులను, స్పోర్ట్స్ షూస్‌ను ప్రభుత్వం అందిస్తుంది. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందిస్తారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రంశిక్షణ ఉంటు ంది. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యే విద్యార్థులకు ప్రయాణ భత్యాలు అందిస్తారు.

విద్యార్థులకు సువర్ణావకాశం...

\- వి శ్రీనివాస్ గౌడ్, డీవైఎస్‌వో, కరీంనగర్



క్రీడాకారులుగా ఎదగాలనుకునే వారికి ఇది సువర్ణావకాశం. క్రీడా పాఠశాలల్లో విద్యను అభ్యసించిన అనేకమంది అంతర్జాతీయ స్థాయితోపాటు ఒలింపిక్స్‌లాంటి మెగా ఇవెంట్లలో పాల్గొని సత్తాచాటారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన శిక్షణను క్రీడా పాఠశాలల్లో అందిస్తారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని బీఆర్ఎస్ నాయకులతో మంగళవారం ఆయన వేములవాడలోని తన నివాసంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిందని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల ప్రకారం సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేయడంలేదన్నారు. ధాన్యం కొనుగోలు చేయడంలోనూ జాప్యం చేయడంతో ధాన్యం వర్షానికి తడిసి మొలకెత్తడం వల్ల వందలాది మంది రైతులు నష్టపోయారన్నారు. కేసీఆర్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తూ క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే విజయం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి రాజు, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, సీనియర్ నాయకులు పోలాస నరేందర్, నరాల దేవేందర్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జోగిని శంకర్, సిరిగిరి చందు, నరాల శేఖర్, గోలి మహేష్, నాయకులు నీలం శేఖర్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, అంజద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని తాజా, మాజీ వార్డు సభ్యులు, బీజేపీ నాయకులు దాసరి పూర్ణిమ- గణేశ్ దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులను మంగళవారం అందజేశారు. పంచాయతీ కార్మికులు పూర్ణిమ- గణేశ్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేత

ఇల్లంతకుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి లక్ష్మన్ కుటుంబీకులకు కేటీఆర్ సేన నియోజకవర్గ సోషల్‌మీడియా అధ్యక్షుడు ఒరుపుల రాములు యాదవ్ నిత్యావసర వస్తువులు అందజేశారు. లక్ష్మన్ వారం రోజుల క్రితం మృతిచెందగా మంగళవారం కుటుంబీకులను పరామర్శించారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పత్రి అంజయ్య యాదవ్, ముద్దాల మల్లయ్య యాదవ్, దాసరి మల్లేశం యాదవ్ తదితరులు ఉన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

ఇల్లంతకుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ శిరీష ఒక ప్రకటనలో కోరారు. ఈవిద్యాసంవత్సరం నుంచి పాఠశాలలో ఇంటర్‌మీడియట్ ప్రారంభం అవుతుందన్నారు. తెలుగు, ఇంగ్లీష్, గణితం,ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలోజి సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. దరఖాస్తుదారులు సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బీఈడీ ఉండాలన్నారు. ఈనెల 7లోపు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నిక ఉండాలి

కోనరావుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఒకే దేశం ఒకే ఎన్నిక ఉండాలని బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ అన్నారు. కోనరావుపేట మండలం బావుసాయిపేటలో పార్టీలకతీతంగా ఒకే దేశం ఒకే ఎన్నిక అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సురభి సురేష్ రావు, రమేష్, గుంటి పరుశురాములు, బానోతు సంతోష్, తిరుపతి, కొమురయ్య, శ్రీనివాస్, వెంకటేశం, వేణు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సుద్దాల విద్యార్థి ప్రతిభ

కోనరావుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన సుంకరి పర్శరాములు నీరజ దంపతుల కుమారుడు సాయి చరణ్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తా చాటాడు. జేఈఈ మెయిన్స్‌లో 5126, అడ్వాన్స్‌డ్‌లో 3891 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య విద్యార్థిని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కచ్చకాయల బాల్‌రెడ్డి, వంగాల శ్రీనివాస్, బుర్ర రమేష్, కాదాసు సుధాకర్, ఎర్రవెల్లి విజయ్, సందీప్, జనార్ధన్, దేవయ్య, కరుణాకర్, స్వామి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కర పత్రాలను అందజేస్తున్న ఎంఈవో కృష్ణహరి, ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఎంఈవో కృష్ణహరి అన్నారు. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కిషన్‌దాస్‌పేట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి మంగళవారం ఆయన బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ పాఠశాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సంపత్‌కుమార్, ఉపాధ్యాయులు నరేశ్, ప్రశాంత్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని కాంగ్రెస్ కార్యకర్త మిట్టపల్లి లక్ష్మణ్ తండ్రి మాణిక్యం ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. కుటుంబీకులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. వెంట నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గౌస్, శ్రీనివాస్ రెడ్డి, కిష్టారెడ్డి, నారాయణరెడ్డి, రాజిరెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

చందుర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు సెస్ ఏఈ మహేష్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని వేములవాడ పట్టణం, వేములవాడ రూరల్, అర్బన్, బోయినపల్లి, చందుర్తి రుద్రంగి, కోనరావుపేట మండలాలకు చెందిన వినియోగదారులకు సహకార విద్యుత్ సరఫరా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు తమ విద్యుత్ సమస్యలను పరిష్కరించుకునేందుకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇద్దరు ఎస్ఐలకు స్థాన చలనం..

సిరిసిల్ల క్రైం జూన్ 3 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఇద్దరు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ మహేష్ బి. గీతే మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. చందుర్తి ఎస్ఐ అంజయ్యను వేములవాడ రూరల్ ఎస్సైగా, వేములవాడ టౌన్ ఎస్ఐ రమేష్‌ను చందుర్తి నూతన ఎస్సైగా బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవలే వేములవాడ రూరల్ ఎస్సై మారుతి పదవీ విరమణ పొందగా ఆయన స్థానంలో చందుర్తి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న బి.అంజయ్యని నియమించారు. అంజయ్య గతంలో వేములవాడ టౌన్ ఎస్ఐగా, హెడ్ కానిస్టేబుల్‌గా, ఎస్పీ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేశారు. రమేష్ గతంలో చెందుర్తి ఎస్ఐగా పనిచేశారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు



అల్మాస్‌పూర్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్, జయవరంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు, చింతల్‌ఠాణాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, మద్దిమల్లలో దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్, కొండాపూర్‌లో పాల్గొన్న రైతులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, అల్మాస్‌పూర్ గ్రామాల్లో అధికారులు మంగళవారం భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లు భూమికి సంబంధించిన అన్ని వివరాలతో కూడిన భూధార్ నంబరును అందించడం జరుగుతోందని అన్నారు. సాదా బైనామా దరఖాస్తులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు క్షేత్ర స్థాయిలో భూములను పరిశీలించడంతో పాటు విచారణ జరిపి వారికి పట్టాలను అందించేందుకు చర్యలు చేపట్టిందని అన్నారు. పల్లెలో భూ సమస్యలు లేకుండా ప్రభుత్వం సదస్సులను నిర్వహిస్తోందని అన్నారు. అనంతరం భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలు, రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో వెంకటేశ్వర్లు కోరారు. రెండు గ్రామాల్లో మొత్తం 105 దరఖాస్తులను స్వీకరించామని తహసీల్దార్ సుజాత పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, నాయబ్ తహసీల్దార్ మురళీకృష్ణ, ఆర్ఐ శ్రవన్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, వెంకటేష్, సాహెబ్, బుచ్చాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం కోనరావుపేట తహసీల్దార్ వరలక్ష్మి ప్రారంభించారు. కొలనూరు, బావుసాయిపేట, లచ్చపేట తండాలో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా 60 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : మండలంలోని జయవరం, ఎదురుగట్ల గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. రెవెన్యూ సదస్సులో భాగంగా ఎదురుగట్ల గ్రామంలో 21, జయవరం గ్రామంలో 5 ఫిర్యాదులు వచ్చినట్లు రూరల్ తహసీల్దార్ అబుబాకర్ తెలిపారు.

● తంగళ్లపల్లి : భూ సమస్యల పరిష్కారానికి తంగళ్లపల్లి మండలం చింతల్‌ఠాణా, గండిలచ్చపేట గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూపొందించిన భూ భారతి చట్టంలో భాగంగా భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులకు మంగళవారం శ్రీకారం చుట్టింది. దీంట్లో భాగంగా రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, చింతల్‌ఠాణా గ్రామంలో భూ సమస్యలకు సంబంధించి 5 దరఖాస్తులు, గండిలచ్చపేట గ్రామంలో 12 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ జయంత్ కుమార్ తెలిపారు. చింతల్‌ఠాణా రెవెన్యూ సదస్సును ఆర్డీవో వెంకటేశ్వర్లు సందర్శించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు.

● వీర్నపల్లి : గ్రామాల్లో నిర్వహించే భూభారతి రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మార్వో ముక్తార్ పాషా పిలుపునిచ్చారు. మండలంలోని మద్దిమల్ల, అడవిపదిర గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులను ఏర్పాటుచేసి భూ సమస్యలపై డీటీసీఎస్ రజిత ఆధ్వర్యంలో అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రజల వద్దకే అధికారులు వస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివ, సిబ్బంది ఉన్నారు.

● ముస్తాబాద్ : మండలంలోని చిప్పలపెల్లి, కొండాపూర్ గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న భూభారతిలో భాగంగా భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ సురేశ్ తెలిపారు. సాదా బై నామా, పేర్లలో తప్పులు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డీటి జి అపర్ణ, ఆర్ఐ రము, ఆర్ సుమలత రైతులు పాల్గొన్నారు.

● చందుర్తి : భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తోందని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం అనంతపల్లి తిమ్మాపూర్ గ్రామాల్లో మంగళవారం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ అనంతపల్లిలో 21, మరిగడ్డలో32 భూ సమస్యలపై మొత్తం 53 దరఖాస్తులను స్వీకరించినట్లు పేర్కొన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, డిప్యూటీ తాసిల్దార్ శ్రీలత, ఆర్ఐలు శ్రీనివాస్, మహేందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక..

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ - లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత



ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఇల్లంతకుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుకను అందిస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. జంగమరెడ్డిపల్లె గ్రామంలోని శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి కళ్యాణ మండపంలో మంగళవారం 760మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. పేదలకు పెట్టుబడి సాయం కింద మహిళా సంఘాల ద్వారా రూ లక్ష రుణాన్ని అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు తాగునీటి, విద్యుత్ సరఫరా, రోడ్ల సౌకర్యం కల్పించి త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. రైతులకు పంట నష్టపరిహారాన్ని గత ప్రభుత్వం ఇవ్వలేదనే విషయాన్ని రైతులు గమనించాలన్నారు. ప్రజాప్రభుత్వంలో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ 10వేలు అందజేశామన్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సహాయం గురించి దళారులకు డబ్బులు ఇవ్వవద్దన్నారు. మండలంలో ఉన్న 34గ్రామాలకు ఇసుక రీచ్‌లను అలాట్ చేశామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు నెలరోజుల్లోగా నిర్మాణ పనులు ప్రారంభించాలని లేనట్లయితే రద్దు అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో గృహనిర్మాణశాఖ పీడీ శంకర్, మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ శశికళ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నాయకులు మహేందర్‌రెడ్డి, ప్రసాద్, పసుల వెంకటి, ఆనందరెడ్డి, తీగల పుష్పలతలతో పాటు వివిధ గ్రామాల నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ ప'రేషన్'

(5వ పేజీ తరువాయి)

సంబంధించిన బియ్యం ఒకేసారి పంపిణీ చేయడం వల్ల కూడా ఇబ్బందులు పడుతున్నారు. సాఫ్ట్‌వేర్ సమస్యతోనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది.

తక్కువ తూకంతో బస్తాలు..

జిల్లాలో రేషన్ డీలర్లకు సరఫరా చేస్తున్న సన్నబియ్యం బస్తాలు 50 కిలోలతో రావాల్సి ఉంటుంది. బస్తా తూకంలో కిలో నుంచి 3కిలోల వరకు తక్కువ వస్తున్నాయని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి 50 కిలోల బస్తా గన్నీ బ్యాగుతో కలిపి 50కిలోల 500 గ్రాములు ఉండాలి. తక్కువ తూకంతో డీలర్లు బెంబేలెత్తిపోతున్నారు. డీలర్లు మాత్రం లబ్ధిదారులకు కోత లేకుండా పంపిణీ చేయడం ద్వారా నష్టపోతున్నారని తెలుస్తోంది.

మిల్లర్లు, అధికారుల కుమ్మక్కు..

రేషన్ డీలర్లకు సరఫరా అవుతున్న బియ్యం బస్తాల్లో తక్కువ రావడం వెనక మిల్లర్లు, అధికారుల కుమ్మక్కు ఉందనే ఆరోపణలు ఉన్నాయి. మిల్లర్ల నుంచి బియ్యం బస్తాలు తక్కువ తూకంతో వస్తున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మిల్లర్ల నుంచి వస్తున్న బియ్యంపై పౌర సరఫరాల శాఖ పట్టించుకోకపోవడం వెనక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డీలర్లు తక్కువ తూకం వస్తున్నాయని అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా పట్టించుకోకపోగా రేషన్ డీలర్లనే ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

రోడ్డుపైన సిమెంటు పైపులు.. తప్పని ఇబ్బందులు



బావుసాయిపేటలో రోడ్డుపై వదిలేసిన పైపులు

కోనరావుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మురికి నీరు బయటకు వెళ్లడానికి తీసుకువచ్చిన పైపులను నడిరోడ్డుపై నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో డ్రైనేజీ నీరు బయటకు వెళ్లకపోవడంతో దుర్గంధం వెదజల్లడమే కాకుండా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టే క్రమంలో మురుగు నీరు బయటకు వెళ్లడానికి సిమెంట్ పైపులను సదరు కాంట్రాక్టర్ తెప్పించారు. కానీ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత పైపులను అలానే ప్రధాన రహదారిలో నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో డ్రైనేజీ నీరు బయటకు వెళ్లకుండా మధ్యలోనే ఆగిపోయి దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు, ఈగలు ఎక్కువై వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. డ్రైనేజీ నీరు వెళ్లడానికి సిమెంట్ పైపులు వేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ పైపులను అక్కడే వదిలేసి వెళ్లడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వేములవాడను వణికిస్తున్న వరుస చోరీలు

- తాజాగా మూడిళ్లలో దొంగతనం - భయాందోళనలో ప్రజలు

వేములవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలో వరుస చోరీలు వణిస్తున్నాయి. గత కొద్దిరోజులుగా మార్కండేయ నగర్, సాయినగర్ ప్రాంతాలలో తాళం వేసి ఉన్న పలు ఇళ్లలో దొంగతనాలు జరగగా, ఆ దొంగతనాల కేసులను ఛేదించక ముందే దొంగలు తాజాగా మరో మూడిళ్లలో దొంగతనానికి పాల్పడ్డారు. స్థానిక సాయి నగర్ లో ఎమ్మెల్యే నివాసం వెనుక వైపు ఉన్న ఇల్లు తాళం వేసి ఉండడం గమనించిన దొంగలు తాళం తొలగించి దొంగతనానికి పాల్ప డ్డారు. ఇంటి యజమాని అమ్మాయి హైదరాబాద్ వెళ్లగా పైఅంతస్తులోని ఆమె పోర్షన్‌లో ప్రవేశించిన దొంగలు బెడ్ రూమ్ గది తాళం పగలగొట్టి వస్తువులన్నిం టినీ చిందరవందరగా పడేసి దొరికిన బంగారు ఆభరణాన్ని ఎత్తుకుపోయారు. ఇక్కడకు సమీపంలోనే లచ్చయ్య అనే వ్యక్తికి చెందిన ఇంట్లో అద్దెకు ఉంటున్న రెండు పోర్షన్లలోనూ, గౌతమ్ మోడల్ పాఠశాల సమీపంలో ఉన్న మరో ఇంట్లోనూ దొంగలు పడినట్లు చెప్పుకుంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్ టీం సహాయంతో వివరాలను సేకరించారు. గత పదిహేను రోజులుగా తాళం వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దు

- ప్రభుత్వం అందించే విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి - జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం



ఇల్లంతకుంటలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు, రైతులు



కోనరావుపేటలో విత్తనాలను అందజేస్తున్న వ్యవసాయ అధికారి సందీప్



చందుర్తిలో విత్తన బ్యాగులను అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

సిరిసిల్ల రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రైతులు నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మేలు రకం విత్తనాలను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ అధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాణ్యమైన విత్తనం, రైతన్నకు నేస్తం అనే కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేటలోని జిల్లా రైతు వేదికలో మంగళవారం రెవెన్యూ గ్రామాలల్లో ముగ్గురి చొప్పున రైతులకు నాణ్యమైన వరి విత్తనాలను జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, బాబుజగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ సునీతలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు తక్కువ ధరలకు విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన దుకాణాల్లోనే రైతులు విత్తనాలను కొనుగోలు చేసి పంటలను సేంద్రీయ ఎరువులతోనే సాగు చేయాలన్నారు. సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంటలు అధిక దిడుబడులు వస్తాయన్నారు. సిరిసిల్ల వ్యవసాయాధికారి సందీప్, వ్యవసాయ విస్తరణ అధికారులు లతశ్రీ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : నాణ్యమైన విత్తనాలతో పంటల్లో అధిక దిగుబడి వస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రియదర్శిని మాట్లాడారు. రైతులకు పలు రకాల నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. సెస్ డైరెక్టర్ సందు పట్ల అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ తలారి రాణిన ర్సింలు, మండల వ్యవసాయాధికారి దుర్గరాజు, ఏఈవోలు నరేశ్, సౌమ్య, రేవతి, అఖిల, డైరెక్టర్‌లు, నాయకులు తాళ్ల విజయ్‌రెడ్డి, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్‌రెడ్డి, శీల ప్రశాంత్, మిరుదొడ్డి భాను పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : మర్రిపల్లి గ్రామంలోని రైతు వేదికలో నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే కార్యక్రమాన్ని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం నిర్వహించారు. రైతులకు వ్యవసాయ పరిశోధన సంస్థల ద్వారా ఉత్పత్తి చేసిన నాణ్యమైన విత్తనాలను అందజేశారు. వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ పి మాధవి, మార్కెట్ కమిటీ చైర్మెన్ రొండి రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కనికరపు రాకేష్, వ్యవసాయ సహాయ సంచాలకులు జె.రామారావు, వ్యవసాయశాఖ అధికారిని వి.వినీత, ఏఈవోలు అనూష, మసూద్, ఫజలోద్దిన్, రైతులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : రైతులు నాన్యమైన విత్తనాలను తమ పొలాల్లో తయారు చేసుకోవచ్చని వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త రమేష్ సూచించారు. మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం 7 క్లస్టర్లకు చెందిన అభ్యుదయ రైతులకు గ్రామగ్రామాన నాణ్యమైన విత్తనం పేరుతో పంపిణీ చేశారు. రైతులకు వరిపంటలో జగిత్యాల వరి-1, వరంగల్ 915, పెసరలో ఎంజీజి 295 రకాల విత్తనాలను పంపిణీ చేశారు. ఏఈఓలు గంగ, జ్యోతి, రవళి, లలిత, అర్చన, అభిషేక్, అర్చనలతో పాటు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన విత్తనాలను నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు మండల వ్యవసాయ అధికారి సందీప్ కుమార్ అందజేసి మాట్లాడారు. మండలంలోని 20 రెవెన్యూ గ్రామాల్లో ఒక్కొక్క గ్రామానికి ముగ్గురి రైతులను ఎంపిక చేసి వరి, పెసర సీడ్లను అందజేసినట్లు తెలిపారు. కోనరావుపేట ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, సింగరేణి డైరెక్టర్ రమేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : నాణ్యమైన విత్తనం ప్రతి గ్రామానికి కార్యక్రమంలో భాగంగా మంగళవారం వీర్నపల్లి మండలంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అధ్వర్యంలో ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మణ్ రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ చిరంజీవి, ఏఎంసీ డైరెక్టర్ చంద్రమౌళి, మదన్‌లాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, మండల నాయకులు కాంతయ్య రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారి దీపిక, రమణ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారిని అనూష అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతి రెవిన్యూ గ్రామం నుండి ముగ్గురు రైతులను ఎంపిక చేసి నాణ్యమైన విత్తనాలను అందజేశారు. ఎంపికైన రైతుకు 10 కేజీల వరి విత్తనాలు, మూడు కేజీల పెసర విత్తనాలు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు జోగేశ్వర్, శిరీష, రమ్య, ప్రవీణ్, శారదలు, రైతులు పాల్గొన్నారు.